క్లుప్తంగా

ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి



సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ వెలికితీత లక్ష్యాలను అధిగమించాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్టు, ప్లానింగ్) జి. వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఇల్లెందులోని జేకే ఓసీలో పర్యటించి, ఓసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓసీలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ఉద్యోగులకు రక్షణపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న పంప్‌స్టోరేజ్ పవర్ ప్లాంట్, సహజ వనరులతో విద్యుత్ ఉత్పత్తి చేస్తామని తెలిపారు. కాగా జేకేఓసీ ప్రాజెక్టు ఎక్స్‌టెన్షన్‌ను త్వరితగతిన చేపట్టాలని, ఇల్లెందు మనుగడ కాపాడాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రెటరీ పడిదల నవీన్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ బి.బాబారావులు డైరెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. డైరెక్టర్ వెంట ఏరియా జీఎం జాన్ ఆనంద్, పీఓ బి. వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పూర్ణచందర్, చిన్నయ్య, శివప్రసాద్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, శివకుమార్, మహేష్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన



లక్ష్మీదేవిపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మధు

పాల్వంచరూరల్: పాల్వంచ పట్టణం, మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం కొత్తగూడెం ఆర్డీఓ మధు పరిశీలించారు. లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నవభారత్, పాత పాల్వంచ, గట్టాయిగూడెంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన తాగునీరు, విద్యుత్, టాయిలెట్ల సౌకర్యాలతో పాటు ర్యాంప్‌లను తనిఖీ చేశారు. తహసీల్దార్ వివేక్, సిబ్బంది రవికుమార్‌రెడ్డి, హచ్యా, నాగేశ్వరరావు ఉన్నారు.

ఆత్మహత్యపై కేసు నమోదు

ఇల్లెందు: మండలంలోని కొత్తపూసపల్లికి చెందిన సకినాల సాహిత్ (30) గ్రామం వెలుపల వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రవి కేసు నమోదు చేశారు. ఏడేళ్ల కిందట ఓ మహిళను సాహిత్ ప్రేమవివాహం చేసుకున్నాడు. కొంతకాలానికి దంపతుల మధ్య గొడవలు జరగటంతో భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన సాహిత్ మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పారదర్శకతకు పెద్దపీట

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో ఆస్తుల వివరాలు పట్టణ ప్రజలకు వెల్లడించటమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో మాట్లాడుతూ ఐదేళ్లకోసారి పాలక వర్గం తమ పాలనలో చేపట్టిన అభివృద్ధి, మున్సిపాల్టీకి ఉన్న ఆస్తుల వివరాలు ప్రజలకు వెల్లడిస్తే పారదర్శకతకు పెద్దపీట వేసినట్లు అవుతుందని ఆయన తెలిపారు.

నామినేషన్‌కు తరలివెళ్లిన నాయకులు

ఇల్లెందు: మహబూబాబాద్ ఎంపీ స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాలోత్ కవిత మంగళవారం నామినేషన్ వేస్తున్నందున ఇల్లెందు నుంచి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, భద్రాద్రికొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తరలివెళ్లారు. వారి వెంట గిన్నారపు రాజేశ్, కృష్ణారావు, నబీ, పోషం ఉన్నారు.

26 నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఏటా మాదిరిగా ఈసారి కూడా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య తెలిపారు. 18 ఏళ్ల లోపు సింగరేణి ఉద్యోగుల పిల్లల (బాలురు, బాలికలు) కోసం ఈ నెల 26 నుంచి మే 20వ తేదీ వరకు అనుభవజ్ఞులైన శిక్షకుల ఆధ్వర్యాన సమ్మర్, ఇతర క్రీడాంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో అథ్లెటిక్స్, కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్‌లో బాస్కెట్‌బాల్, ప్రకాశం స్టేడియంలో బాక్సింగ్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఉషూ, కరాటేతో పాటు కొత్తగూడెంలోని సింగరేణి హైస్కూల్‌లో డ్రాయింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు జీఎం తెలిపారు.

పో‘లాంగ్’ కేంద్రాలు..

- ఆవాసాలకు దూరంగా పోలింగ్ కేంద్రాలు
- నాలుగైదు కిలోమీటర్లు వెళ్తేనే ఓటు వేసే అవకాశం
- ఈసారైనా దగ్గరగా మార్చాలని వినతులు



పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన రేగులగూడెంలోని పాఠశాల

పాల్వంచరూరల్: ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ఏజెన్సీ ప్రాంత ప్రజలు నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిందే. ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలో 90 పోలింగ్ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 89,826 మంది ఓటర్లు ఉన్నారు. అయితే, ఏళ్ల తరబడి దూరప్రాంతాలకు వెళ్లి ఓటు వేయడం భారంగా మారుతుందని చెబుతున్నారు.

ఓటర్లకు దూరంగా..

మండలంలోని రేగులగూడెం పోలింగ్ స్టేషన్ మామిడిగూడెం, చంద్రాలగూడెం, తుమ్మలగూడెం గ్రామాల ఓటర్లకు రెండు కిలోమీటర్ల దూరం, రాళ్లచెలక ఓటర్లకు నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. కొత్తూరుగుంపు, గంగదేవిగుప్ప, నర్సింహసాగర్, చింతగుప్ప ఓటర్లు మూడు కిలోమీటర్ల దూరంలోని ఉల్వనూరు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవాలి. సారెకల్లు గ్రామ ఓటర్లు కిలోమీటరుపైగా దూరంలో ఉన్న కారెగట్టు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తున్నారు. రెడ్డిగూడెం శివారు ఎస్టీ కాలనీ ఓటర్లు కిలోమీటర్ దూరంలో ఉన్న రెడ్డిగూడెం పోలింగ్ కేంద్రానికి నడిచి వెళ్తేనే ఓటు హక్కు వినియోగించుకోవడం సాధ్యమవుతుంది. తవిశలగూడెం, నర్సంపేట గ్రామ ఓటర్లు నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాండురంగాపురం గ్రామంలోని పోలింగ్ కేంద్రాని వెళ్తే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. కొత్తసూరారం ఓటర్లు రెండు కిలోమీటర్ల దూరంలో పాత సూరారం లోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాలి. పూసలతండా, దేవిజ్యాతండా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలంటే రెండు కిలోమీటర్ల దూరంలోని కోడిపుంజులవాగు కేంద్రానికి వెళ్లాల్సి ఉండగా.. బొజ్జ్యా తండా ఓటర్లు రెండు కిలోమీటర్ల దూరంలోని నాగారానికి వెళ్లాల్సి ఉండగా.. దంతలబోరులో ఉన్న పోలింగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో బంద్రుగొండ, ఐదు కిలోమీటర్ల దూరంలో కొయ్యగట్టు ఓటర్లు ఉన్నారు.

కేంద్రాలను మార్పు చేయాలి



దంతలబోరు ఎస్సీకాలనీలో పోలింగ్ కేంద్రానికి రావడం బంద్రుగొండ, కొయ్యగట్టు ఓటర్లకు భారంగా మారింది. మండలంలో చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఈసారైనా పోలింగ్ కేంద్రాలను సమీప ప్రాంతాలకు మారిస్తే ఉపయోగంగా ఉంటుంది.

–నిమ్మల రాంబాబు

ఓటు వేయడం కష్టమవుతోంది..



చాలా పోలింగ్ కేంద్రాలు గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. దీంతో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ఇబ్బందిగా మారింది. ఓటు వేయాలంటే రవాణా సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలి. అధికారులు స్పందించి పోలింగ్ కేంద్రాలను మారిస్తే ఓటర్లపై భారం తగ్గుతుంది.

–నాగిరెడ్డి, పాల్వంచ మండలం

సౌకర్యాలు ఉంటేనే కొత్త కేంద్రాలు



200 మంది ఓటర్లు ఉండి, అక్కడ ప్రభుత్వానికి చెందిన రెండు, మూడు గదుల భవనం ఉంటేనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. భద్రతాపరమైన సౌకర్యాలు, ఇతర వసతులు ఉండాలి. అయినా అవసరమైన కేంద్రాలపై ప్రతిపాదనలు పంపిస్తాం.

–వివేక్, తహసీల్దార్, పాల్వంచ

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంఅర్బన్: ఈదురుగాలులు, అకాల వర్షంతో ఇటీవల కొత్తగూడెంలో దెబ్బతిన్న ప్రాంతాల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం పర్యటించారు. గాజులరాజం బస్తీ, బూడిదగడ్డ, కూలీలైన్, హనుమాన్ బస్తీల్లో పర్యటించిన ఆయన దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి నష్టంపై బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, లైన్ల పునరుద్ధరణకు జరుగుతున్న పనులను పరిశీలించారు. నిర్విరామంగా పనులు కొనసాగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. అలాగే, ఇళ్లు కోల్పోయిన పేదలకు పునరావాసం కల్పించడంతో పాటు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే, పంట నష్టంపై అంచనాలు రూపొందించాలన్నారు. ఆ తర్వాత గాజులరాజంబస్తీలో ఇంటి రేకులు పడడంతో గాయపడిన దేవమ్మను పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న పశ్య పద్మ

పాల్వంచ: గత అసెంబ్లీ ఎన్నికల సమయాన కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను త్వరగా అమలుచేయాలని రైతు సంఘం (ఎఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం అధ్యక్షత వహించగా పద్మ మాట్లాడారు. వ్యవసాయ రంగం పూర్తిగా క్షీణించిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం ప్రణాళికాయుతంగా సాగు రంగాన్ని అణచివేస్తూ, నల్ల చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ మేరకు రైతు సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి బ్రహ్మం, నాయకులు చంద్ర నరేంద్ర, కల్లూరి వెంకటేశ్వరరావు, సలిగంటి శ్రీనివాస్, చిరుమామిడి వెంకటేశ్వరరావు, గుగులోతు రామచందర్‌రావు, సీతారాంరెడ్డి, సుబ్బారెడ్డి, సురేశ్, నాగేశ్వరరావు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ గార్డులను ఆదుకోవాలి..



మాట్లాడుతున్న ఇఫ్టూ నేత యాకుబ్‌షావలి

ఇల్లెందు: సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని ఇఫ్టూ రాష్ట్ర నాయకులు యాకుబ్‌షావలి, పాయం వెంకన్న కోరారు. మంగళవారం ఇల్లెందులోని సింగరేణి మైదానంలో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు నామమాత్రపు వేతనాలు చెల్లించి శ్రమదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. పర్మనెంట్ సెక్యూరిటీ గార్డులు వారాంతపు సెలవు రోజున పనిచేస్తే డబుల్ మస్టర్ ఇస్తున్నారని, ప్రైవేట్ గార్డులకు ఒకటే మస్టర్ అమలులో ఉందన్నారు. ఇల్లెందులో 42 మంది కార్మికులకు టెండర్ పిలిచి 70 మందితో పని చేయించుకుంటున్నారని, వీరికి నెలకు 18 నుంచి 20కి మించి మస్టర్లు రావటం లేదని పేర్కొన్నారు. ప్రతీ గార్డుకు నెలకు 26 మస్టర్లు ఇవ్వాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన సొసైటీ డైరెక్టర్లు



బీఆర్‌ఎస్‌లో చేరిన డైరెక్టర్లకు పార్టీ కండువాలు కప్పుతున్న మాలోతు కవిత, హరిప్రియ

టేకులపల్లి: మండలంలోని బేతంపూడి సహకార సంఘం డైరెక్టర్లు ముగ్గురు బీఆర్‌ఎస్‌లో చేరారు. మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర వరప్రసాద్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఆధ్వర్యాన డైరెక్టర్లు భూక్యా బాలాజీ, బానోతు ఇస్తారి, చీమల లక్ష్మీనారాయణ బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి మహబూబాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలుతో పాటు లక్కినేని శ్యామ్, మౌలానా, బర్మావత్ శివ, భూక్యా లాలు, కుమ్మరి కిరణ్, లచ్చు, ఆమెడ రేణుక, రాజు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం




స్వామిని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీహోమం నిర్వహించారు. తొలుత స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశాక చండీహోమం గావించారు. అర్చకులు, ఈఓ జి.సుదర్శన్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గోశాలకు పశువుల అప్పగింత

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న ఎద్దులను పోలీసులు పట్టుకుని పాల్వంచలోని గోశాలలో మంగళవారం అప్పగించారు. అశ్వాపురం మండలం నుంచి వాహనంలో తొమ్మిది ఎద్దులను అక్రమంగా కొత్తగూడెం వైపు తరలిస్తుండగా పాల్వంచ పోలీసులు పట్టుకున్నారు. అనంతరం వాటిని నవభారత్ ఏరియాలో గల అన్నపూర్ణ గోసంరక్షణ సమితికి అప్పగించినట్లు సమితి ప్రధాన కార్యదర్శి ఆంజనేయ శర్మ తెలిపారు. తొక్కిసలాట కారణంగా రెండు ఎద్దుల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందురూరల్: మండలంలోని రాఘబోయినగూడెం చర్చి 29వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా ఉదయమే చర్చికి చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ప్రాంగణలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, చర్చి పాస్టర్లు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. 29 ఏళ్ల కిందట గ్రామస్తులు స్వయంగా చర్చి నిర్మించుకున్నారని, ఏటా వార్షికోత్సవాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఫ్రాంక్లిన్, భీమాపాల్, గ్రామస్తులు, చర్చి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇకనైనా ఇంటి నంబర్లు కేటాయిస్తారా?

'సాక్షి' కథనంతో ఉన్నతాధికారుల్లో కదలిక

ఇల్లెందురూరల్: పాతికేళ్లుగా ఇంటి నెంబర్ల రివిజన్ లేకపోవడంతో ప్రతీ గ్రామపంచాయతీ రూ.వేలల్లో ఆదాయాన్ని కోల్పోతోంది. ఈ అంశంపై 'ఇంటి పన్నులకు ఏదీ మోక్షం' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో ఉన్నతాధికారుల్లో కదలిక వచ్చినట్లు సమాచారం. ఇంటి నంబర్ల కేటాయింపు, రివిజన్ ప్రక్రియపై చట్టాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులు సమాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై ఇంతకాలం ఇంటి నెంబర్లు లేక అవస్థలు పడుతున్న ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఏజెన్సీలో 1/70 చట్టం 1970 నుంచి అమల్లో ఉండగా, 1998–99 వరకు జీపీల్లో నూతనంగా గృహాలకు నంబర్లు కేటాయించారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సౌకర్యం సమకూర్చారు. ఆ సమయంలో ఐదేళ్లకోమారు ఇంటి నంబర్లు, పన్నులు రివిజన్ చేశారు. ఆ తర్వాత మాత్రం ఏజెన్సీ చట్టాల పేరిట ప్రక్రియ నిలిపివేయడం గమనార్హం. ఈ అంశంపై ఇటీవల కదలిక వచ్చిన నేపథ్యాన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని పలువురు ఎదురుచూస్తున్నారు. అయితే, ఇంటి నంబర్ల కేటాయింపు, ఇంటి నిర్మాణ అనుమతుల విషయంపై లోక్‌సభ ప్రచారానికి రానున్న నేతలను ప్రశ్నించేందుకు పలు గ్రామాల ప్రజలు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

టిఫిన్ చేస్తూ.. చాయ్ తాగుతూ



సీ-కాలనీ గేట్ వద్ద టిఫిన్ చేస్తున్న నామ

పాల్వంచరూరల్: ఖమ్మం లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పాల్వంచ మండలం పెద్దమ్మతల్లి ఆలయంలో మంగళవారం పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని బస్టాండ్‌సెంటర్, సీ–కాలనీగేట్, దమ్మపేట సెంటర్‌లో స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడ రోడ్డు వెంట టిఫిన్ చేయడంతో పాటు ఆయన చాయ్ తాగుతూ ప్రజలు, కార్మికుల సమస్యలపై ఆరా తీసి తనను మరోమారు గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు నాయుడు, రాజు, సింధుతపస్వి, విశ్వనాథం, ప్రభాకర్, రేగడి మధు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి



ల్యాబ్‌లో పరిశీలిస్తున్న నోడల్ అధికారి సులోచన

ఇల్లెందు: నాణ్యమైన విద్యనందిస్తున్న మైనార్టీ కాలేజీలో సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి సులోచన సూచించారు. ఇల్లెందులోని మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలను ఆమె పరిశీలించారు. అక్కడి వసతులు, తరగతి గదులు, ప్రయోగశాలలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మైనార్టీ కళాశాలలో వసతులు ఉండటంతో పాటు నాణ్యమైన విద్య అందుతున్నందున మైనార్టీ, నాన్ మైనార్టీ విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్, అధ్యాపకులు కొండల్‌రావు, అశోక్, హరీశ్, గౌస్, సైదావలి, రేష్మ, నళిని, కృష్ణకుమారి, నజీముద్దీన్ తదితరులు ఉన్నారు.

మూడు రోజులుగా కరెంట్ బంద్

- తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు
- ఉక్కపోతతోపాటు నీళ్లు లేక అవస్థలు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఉక్కపోతతోపాటు కనీస అవసరాలకు నీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, వర్షంతో విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగి పడ్డాయి. ఇక ఆరోజు నుంచి మంగళవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా కాలేదు. పట్టణంలోని హనుమాన్‌బస్తీ, గాజులరాజంబస్తీ, ప్యూన్‌బస్తీ, పాత కొత్తగూడెం, బాబూక్యాంప్, బర్మాక్యాంప్, రైటర్‌బస్తీ, గొల్లగూడెం, రామవరం తదితర ప్రాంతాల్లో మూడు రోజులుగా కరెంటు లేదు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అధికారులపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

జిల్లా ఆస్పత్రిలోనూ..

జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి ఆవరణలో విద్యుత్ స్తంభంపై చెట్లు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అప్పటి నుంచి మంగళవారం వరకు 38 గంటలపాటు విద్యుత్ సరఫరా లేదు. ఆస్పత్రిలో జనరేటర్ ఉన్నప్పటికీ టెక్నీషియన్ లేకపోవడంతో దానిని ప్రారంభించలేదు. 350 పడకలు ఉండే సర్వజన ఆస్పత్రిలోని ఫీమేల్, మేల్, సర్జికల్ ఫీమేల్, సర్జికల్ మేల్, జనరల్ వార్డుల్లో అడ్మిట్ అయిన రోగుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మరుగుదొడ్లలోనూ నీళ్లు లేక ఇబ్బందులు పడ్డారు. మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ సరపరాను పునరుద్ధరించారు. కాగా, విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత, విద్యుత్ అధికారులు సైతం కొందరితోనే పనులు చేయించడంతో విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో జాప్యం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



కూలీలతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఇల్లెందురూరల్: ఉపాధి కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు తుపాకుల నాగేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని కొమరారం గ్రామంలో మంగళవారం ఉపాధి కూలీలతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకూలి రూ.750 చెల్లించాలని, పని ప్రదేశంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలకులు కుట్ర చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టేందుకు కూలీలు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మూడు మాలు, జోగా కృష్ణ, బానోత్ భీముడు, బానోత్ తులస్య, బాయమ్మ, కోరం కృష్ణవేణి, నాలి కృష్ణవేణి, బానోత్ హచ్చి, కోరం రాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి..

పాల్వంచరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ కాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో మంగళవారం బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాండ్ర వినోద్‌రావును గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు లట్టి మురళి, పట్టణ కార్యదర్శి మాధారపు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు గండమల్ల కిరణ్‌కుమార్, కార్యదర్శి కనకరాజు, మహిళా మోర్చ పట్టణ అధ్యక్షురాలు నందిగం వెంకటరమణ, మాలోతు ప్రశాంత్, రాజు, నరేశ్, వెంకన్న, శ్రీను, కిట్టు, కరీముద్దీన్, పాషా పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి



టెన్నిస్ రాకెట్లను పంపిణీ చేస్తున్న పరంధామరెడ్డి

పాల్వంచ: టెన్నిస్ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని జిల్లా డిప్యూటీ స్పోర్ట్స్ ఆఫీసర్ పరంధామరెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని శ్రీనివాసకాలనీలోని టెన్నిస్ క్రీడా మైదానంలో క్రీడాకారులకు నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ క్యాంప్‌ను పరంధామరెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా టెన్నిస్ రాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఒకప్పుడు టెన్నిస్ క్రీడ పట్టణాల్లో మాత్రమే ఉండేదని, ఇప్పుడు జిల్లా నలుమూలలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. కొత్తగూడెం, పాల్వంచలో జాతీయస్థాయి క్రీడాకారులు అందుబాటులో ఉన్నారని, వారి సలహాలు, సూచనలు కొత్తగా వచ్చే క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం టెన్నిస్ క్రీడాకారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచలో ఉన్న టెన్నిస్ మైదానాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అన్నం వెంకటేశ్వర్లు, కార్యదర్శి జకీరయ్య, చలం భాస్కర్, శంకర్, కబీర్, ప్రణయ్, వంశీ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.